సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025




మా భూమి.. మా దేశం.. మా ప్రాంతం.. మా సొత్తు.. మా మనుషులు నినాదంతో ఎందరో మహనీయుల పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్య భారతదేశం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ఉద్యమ సమయం నాటి అనేక సంఘటనలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నాయి. స్వాతంత్ర్య పోరాటానికి వేదికైన మెట్‌పల్లి ఖాదీప్రతిష్టాన్ విదేశీ వస్తు బహిష్కరణలో కీలక పాత్ర పోషించింది. తాజాగా పొలిటికల్ బ్రాండ్‌గా పేరొందుతోంది. ఉమ్మడి జిల్లానుంచి ఎందరో మహనీయులు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. అమరులైన వారి పేరిట శిలాఫలకాలు ఆయా ప్రాంతాల్లో దర్శనమిస్తున్నాయి. నాటికీ.. నేటికీ పరిస్థితులు మారాయి. 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అయినప్పటికీ విద్య, వైద్యం, చట్టాలపై మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందని నేటి యువత అంటోంది. 2047 నాటికి వందేళ్ల భారతదేశాన్ని పునర్నిర్మిస్తామని సగర్వంగా చెబుతోంది. నేడు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా..

సగర్వంగా.. స్వాతంత్ర్యంగా

- స్వాతంత్ర్య ఉద్యమంలో ఉమ్మడి జిల్లా గుర్తులు
- పోరాటానికి వేదికైన ఖాదీ ప్రతిష్టాన్
- దేశం కోసం పోరాడిన మహనీయులు
- 2047 నాటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన యువత
- నేటి పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

(నేడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గడిచిన 78ఏళ్లలో, ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు, పరిస్థితులపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 100 మందిని పలుకరించగా.. వెల్లడించిన అభిప్రాయాలు ఇలా..)



ప్రస్తుతం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య?

స్వేచ్ఛా, సమానత్వం ఎక్కడైనా కనిపిస్తున్నాయా?

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ దక్కాలంటే నిజాయితీగా పని చేయాల్సిన రంగం?

న్యూస్‌రీల్

పంద్రాగస్టుకు ముస్తాబు



సిరిసిల్ల: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పోలీసు ఆఫీస్ (డీపీవో) ఆవరణలోని పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. శుక్రవారం జరిగే వేడుకల ఏర్పాట్లను గురువారం సాయంత్రం సిరిసిల్ల ఆర్డీవో సీహెచ్. వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సురభి మహేశ్‌కుమార్‌లు పర్యవేక్షించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొంటుండగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బి గితే, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరవుతారు. ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 9.32 గంటలకు పోలీస్ గౌరవ వందనం, 9.40లకు ముఖ్యఅతిథి సందేశం, 9.55లకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.25 గంటలకు వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి ప్రశంసా పత్రాల ప్రధానం, 11.02 గంటలకు కార్యక్రమం ముగుస్తుంది.

శిథిలాల తొలగింపునకు ముహూర్తం ఖరారు

- నేటి నుంచి పనులు ప్రారంభం



రోడ్ల విస్తరణలో కూల్చిన భవనాల శిథిలాలు

వేములవాడ: వేములవాడ మేన్‌రోడ్డు 80 ఫీట్ల విస్తరణ చేసే క్రమంలో రోడ్డుకు ఇరువైపులా దాదాపు 254 నిర్మాణాలను అధికారులు కూల్చేశారు. జూన్ 15న ప్రారంభమైన ఈ ప్రక్రియ కోర్టు స్టేలతో కాస్త నిలిచినా చివరికి పూర్తిస్థాయిలో పూర్తయ్యాయి. కూల్చివేసిన శిథిలాలు అలాగే ఉండిపోయాయి. అధికారులు శిథిలాలల నుంచి వచ్చిన వ్యర్థాలను దూర ప్రాంతాలకు తరలించేందుకు రూ.22 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లను పిలిచారు.

45.5 లెస్‌కు టెండర్ ఫైనల్

రూ. 22 లక్షలతో టెండర్లకు ఆహ్వానించిన మున్సిపల్ అధికారులకు ఆన్‌లైన్‌లో 12 మంది టెండర్లు దాఖలు చేశారు. ఈనెల 11తో గడువు ముగియడంతో గురువారం టెండర్ల ప్రక్రియను క్లియర్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. 45.5 శాతం లెస్‌కు హైదరాబాద్‌కు చెందిన విజయ ఎర్త్ మూవర్స్ సంస్థకు టెండర్‌ను అప్పగించామని అన్నారు. శుక్రవారం నుంచి స్క్రాప్‌ను తొలగించే పనులు ప్రారంభించి నెల రోజుల్లోగా పూర్తిగా క్లీన్ చేసి ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. భవనాల శిథిలాలను ఎస్పీ కార్యాలయం ప్రాంతంలో డంప్ చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. కాగా పట్టణ శివారులోని కాలనీల్లో చాలా వరకు వర్షపు నీరు నిలుస్తూ కాలనీవాసులు నానాఅవస్థలు పడుతున్నారు. ఈక్రమంలో ఈవ్యర్థాలను శివారు కాలనీల్లోని రోడ్లలో వేయాలని స్థానికులు కోరుతున్నారు.

సింగిల్‌విండోల పదవీకాలం పొడిగింపు

సిరిసిల్ల అర్బన్: జిల్లాలోని 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలం మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 14వ తేదీతో పాలకవర్గాల గడువు ముగియనున్న నేపథ్యంలో మరో ఆరునెలల గడువు పొడిగింపుతో సింగిల్‌విండోల అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు. ఆగస్టు 15న జెండాను ఎగుర వేసే అవకాశం లభించిందని పేర్కొంటున్నారు.

యూరియా కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రం వీర్నపల్లిలో యూరియా కోసం రైతులు ఆందోళన చేశారు. సింధూర మండల సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాపును గురువారం ప్రారంభించిన జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఏఎంసీ చైర్మన్ రాములుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం మాట్లాడుతూ షాపులో 225 యూరియా బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని మిగతా స్టాకు త్వరలో ఏర్పాటు చేస్తామని తెలపడంతో యూరియా సరఫరా చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. నాలుగైదు రోజుల్లో యూరియాను అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముక్తర్ పాషా, మండల అభివృద్ధి అధికారి బీరయ్య, నాయకులు పాల్గొన్నారు.

పొలిటికల్ బ్రాండ్.. మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్



మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్

కోరుట్ల/మెట్‌పల్లి: ఇక్కడి నేతలకు ఖాదీ బట్టలే స్ఫూర్తి. చాలా మందికి ఖాదీ రాజకీయంగా ఊపిరి పోసిందంటే అతిశయోక్తి కాదు. స్వాతంత్ర్య పోరాటకాలంలో ఖాదీ ఉద్యమానికి వేదికగా నిలిచింది జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి. గాంధీ శిష్యుడు అన్నాసాహెబ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో వెలిసిన ఖాదీ ప్రతిష్టాన్ ఖద్దరు ఆ కాలంలో ఖ్యాతి పొందింది. అప్పటి ఆనవాయితీని పుణికిపుచ్చుకుని మెట్‌పల్లి ప్రాంత రాజకీయ నాయకులు ఖాదీ వస్త్రాలు ధరించడం ఇప్పటికీ దూరం కాలేదు. కడక్ ఖాదీ బట్టలతో ఎవరైనా కనిపిస్తే చాలు ఈయన మెట్‌పల్లి లీడరని చెప్పొచ్చు. 1983లో ఎన్టీఆర్ ప్రభుత్వ హయంలో కార్మికశాఖ మంత్రిగా పనిచేసిన వర్థినేని వెంకటేశ్వర్‌రావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ కేవీ.రాజేశ్వర్‌రావు, జనతా పార్టీ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా ఎన్నికైన కొమొరెడ్డి రామ్‌లు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ఖాదీ ప్రతిష్టాన్ వస్త్రాలు ధరించి రాజకీయాల్లో కీలకంగా ఎదిగిన వారే. 2009 అసెంబ్లీ పునర్విభజనలో కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంగా మారినప్పటికీ.. మెట్‌పల్లి ఖాదీ కార్ఖానా స్ఫూర్తిగా రాజకీయాల్లోకి వచ్చిన నేతలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సంజయ్ ఇక్కడి ఎమ్మెల్యేలుగా కొనసాగడం గమనార్హం.

మొదటి జెండా ఎగిరింది ధర్మపురిలోనే..



కేవీ కేశవులు, మాణిక్యశాస్త్రి (ఫైల్)

ధర్మపురి: నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి, స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తింపు పొందిన జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన కేవీ.కేశవులు, మాణిక్యశాస్త్రి ప్రాణస్నేహితులు. కేశవులు ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగల్‌రావు హయాంలో చేనేత జౌళిశాఖ మంత్రిగా కొనసాగారు. 1947లో ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు ధర్మపురిలోని గోదావరి ఒడ్డునున్న కర్నెఅక్కెపెల్లి భవనంపై తన మిత్రుడైన మాణిక్యశాస్త్రితో కలిసి మొట్టమొదటి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా ఎగురవేయడం నిషేధమని అప్పటి నిజాం ప్రభుత్వం కేశవులను బంధించడానికి ప్రయత్నించగా.. నిండుగా ప్రవహిస్తున్న గోదావరిలోంచి వెళ్లి తప్పించుకున్నారు. ఏడాదిపాటు ముంబయిలో తలదాచుకున్నారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినం రోజు తిరిగి ధర్మపురికి చేరుకున్నారు. 2019 జనవరి 30న అనారోగ్యంతో మృతి చెందారు.

పోరాటాల 'గాలిపల్లి'



స్వాతంత్ర్య పోరాటంలో వీరమరణం పొందిన 11 మంది శిలాఫలకం

ఇల్లంతకుంట: పోరాటాల గ్రామంగా చరిత్రలో నిలిచిపోయింది రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. నిజాంపాలిత ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రానికి ఇంకా విముక్తి లభించలేదు. బద్దం ఎల్లారెడ్డి ప్రాంతమైన గాలిపల్లి ప్రజలు నైజాం పాలనపై తిరగబడ్డారు. 1948 సెప్టెంబర్ మొదటి వారంలో రజాకార్లు గాలిపల్లికి వచ్చారు. తిరుగుబాటుదారులు వారిసైన్యంపై రాళ్లు విసిరారు. రజాకార్ల కాల్పుల్లో తిరుగుబాటుదారుల్లో ముందువరుసలో ఉన్న 11మంది చనిపోయారు. వీరిలో గాలిపల్లికి చెందిన వారు ఏడుగురు, బేగంపేట, సోమారంపేట, తాళ్లపల్లి, నర్సక్కపేట గ్రామాలకు చెందినవారు నలుగురు ఉన్నారు. రజాకార్ల పాలన నుంచి విముక్తి కలిగిన తరువాత గాలిపల్లిలో దాదాపు 20మందికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఫ్రీడంఫైటర్ పింఛన్లు మంజూరు చేశాయి.



'సాక్షి' టాక్ షోలో పాల్గొన్న వికాస్ కళాశాల విద్యార్థులు

అభివృద్ధి చెందిన దేశంగా చూడాలి

- సామాజిక సమస్యలు ఇంకా నిర్మూలన కాలేదు
- మానవ వనరులను మరింత మెరుగుపర్చాలి
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'సాక్షి' టాక్ షోలో విద్యార్థుల మనోగతం

సిరిసిల్లకల్చరల్: ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య భారతదేశంలో ఇప్పటికీ మానిపోని రుగ్మతలు ఎన్నో.. బంధుప్రీతి, అవినీతి, అశ్రిత పక్షపాతం తదితర సామాజిక సమస్యలు ఇంకా నిర్మూలన కాలేదు.. అనేక రంగాల్లో పురోగతి సాధించినా జరగాల్సినంతగా జరగలేదన్నది సుస్పష్టం.. అభివృద్ధి చెందిన భారత దేశంగా చూడాలని యువతరం కలలు గంటోంది.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈతరం యువత దేశం పురోగతిపై ఎలా ఆలోచిస్తుందనే అంశంపై సిరిసిల్లలోని వికాస్ డిగ్రీ కళాశాలలో 'సాక్షి' నిర్వహించిన టాక్ షోలో పాల్గొన్న విద్యార్థులు తమ మనోభావాలను వెల్లడించారు.

అవినీతి రహిత దేశంగా అవతరించాలి



దేశంలో అవినీతి పేరుకు పోయింది. సంబంధిత శాఖ తనిఖీలు జరుపుతున్నా నేరస్తుల జాబితా పెరుగుతూనే ఉంది. పేదవర్గాలు పుష్కలంగా ఉన్న దేశంలో ఆరోగ్యం అందని ద్రాక్షగా ఉంటోంది. నేర చరిత గల నేతలను ఎన్నికల్లో పాల్గొనకుండా నిరోధించాలి.

– సింగారం చందు, బీకాం ఫైనల్

సామాన్యుల జీవితాల్లో మార్పులేదు



దేశంలో టెక్నాలజీ పెరుగుతున్నప్పటికీ సామాన్యుల జీవితాల్లో పెద్దగా మార్పులేవీ లేవు. కనీసం నిత్యావసర సరుకుల ధరలు అందుబాటులో ఉండడం లేదు. మంచినీళ్లు కొనుక్కొని తాగే దుస్థితి కనిపిస్తోంది. నాణ్యమైన విద్య అందించడం ద్వారా మానవ వనరులను సమర్థంగా వినియోగించుకునే వ్యవస్థ రావాలి.

– కొట్టె శివభవాని, బీఎస్సీ ఫైనల్

సాంకేతిక విజ్ఞానం నియంత్రణలో ఉండాలి



నియంత్రిత సాంకేతికత అందుబాటులోకి రావాలి. మరిన్ని కొత్త ఆవిష్కరణలు జరగాలి. సాధారణ ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు చోటు చేసుకునేలా సాంకేతిక విజ్ఞానం అదుపులో ఉండాలి. సామాజిక మాధ్యమాల వినియోగంపై నియంత్రణ ఉండాలి.

– గంగు మహేశ్, బీకాం

విద్యకు పెద్దపీట వేయాలి



పేద వర్గాలకు విద్య, వైద్యం ఉచితంగా అందేలా చూడాలి. ఉచిత పథకాలు అట్టడుగు వర్గాల వారికే పరిమితం చేయాలి. యువతకు నాణ్యమైన ఉచిత విద్య అందించడం ద్వారా స్వయం సమృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు రచించాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత రవాణ సౌకర్యం కల్పించాలి.

– వేముల నిరోషా, బీఎస్సీ డేటా సైన్స్

అవినీతిని నిర్మూలించి ప్రక్షాళన చేయాలి



ఎన్నో ఏళ్లుగా అభివృద్ధి చెందుతున్న దేశంగానే కీర్తించబడుతోంది. అన్ని రంగాల్లో అవినీతిని నిర్మూలించి సమూలంగా ప్రక్షాళన చేయాలి. అభివృద్ధి చెందిన భారతదేశంగా అవతరిస్తే చూడాలని యువత ఆరాటపడుతోంది. అందుకు అనుగుణమైన పరిపాలన వ్యవస్థ రావాలి.

– పోచవేని ఆర్తి, బీఎస్సీ ఫైనల్

కఠిన శిక్షలు అమలు చేయాలి



దేశంలో నేర ప్రవృత్తి క్రమంగా పెరుగుతుండటం ప్రమాదకరం. కేసుల విచారణ త్వరితగతిన జరిగి నేరస్తులకు శిక్షలు పడే సమయం కుదించబడాలి. వేల సంఖ్యలో కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉంటున్నాయి. సత్వర విచారణ, కఠిన శిక్షలను అమలు చేయడం ద్వారా నేర ప్రవృత్తిని సమాజంలో నిర్మూలించాలి.

– గజభీంకార్ రాంప్రసాద్, బీకాం

తెలివితేటల ఆధారంగా రిజర్వేషన్ కల్పించాలి



దేశంలో అమలవుతున్న రిజర్వేషన్ల ప్రక్రియ స్వాతంత్ర్యం వచ్చిన పదేళ్ల వరకు మాత్రమే అనే నిబంధన ఉంది. వివిధ కారణాలతో ఇన్నేళ్లు కొనసాగిస్తున్నారు. మతం ఆధారంగా కాకుండా తెలివితేటల ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేసే ప్రయత్నాలు జరగాలి.

– ఎండీ షానవాజ్, బీబీఏ

రక్షణ వ్యవస్థ పటిష్టంగా ఉండాలి



దేశ రక్షణ విషయంలో రాజీ పడే పరిస్థితి ఉండొద్దు, దాయాది దేశాల కవ్వింపు చర్యల వల్ల అస్థిరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇండియా వైపు కన్నెత్తి చూడాలంటేనే వణికిపోయేలా అత్యాధునిక రక్షణ పరికరాలు మరిన్ని తయారు కావాలి. దేశ రక్షణ యంత్రాంగం ఎంత పటిష్టంగా ఉంటే అంతగా అభివృద్ధికి మార్గం సులువవుతుంది.

– గౌడుగు నీరజ, బీఎస్సీ డేటా సైన్స్



భగీరథ.. ఇదేం వ్యథ

సిరిసిల్ల పెద్దూరు డబుల్‌బెడ్రూం ఇళ్లలో ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. 43 బ్లాకుల్లో నివసిస్తున్న 516 కుటుంబాలకు సరిపడా నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటున్నారు. నీటి కోసం మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేయడంతో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. వచ్చిన ట్యాంకర్ల నీటి సామర్థ్యం సరిపోవడం లేదు. దీంతో నీటి కోసం ఎగబడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల జిల్లా







ఆదర్శ మండల సమాఖ్యకు అవార్డు ప్రదానం



అవార్డు స్వీకరిస్తున్న మండల సమాఖ్య అధ్యక్షులు

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట ఆదర్శ మండల సమాఖ్య అధ్యక్షురాలు కట్ట సౌమ్య, మాజీ అధ్యక్షురాలు బొడిగ వనజలు గురువారం రాత్రి ఢిల్లీలోని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రులతో అవార్డు స్వీకరించారు. ఢిల్లీలోని భారతరత్న సుబ్రహ్మణ్యం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, చంద్రశేఖర్, కమలేష్ పాస్వాన్, ఆధ్వర్యంలో అవార్డు అందజేశారు. ఆదర్శ మండల సమాఖ్య కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ నిర్బర్ సంగతన్ అవార్డుకు జాతీయస్థాయిలో ఎంపికై ంది. అవార్డు స్వీకరించేందుకు మండలి సమాఖ్య అధ్యక్షులు రెండు రోజుల క్రితం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. వారితో పాటు డీఆర్డీవో శేషాద్రి కూడా వెళ్లారు. రుణాలు అందించడంలో, సకాలంలో రుణాలు రికవరీ చేయడంలో మీటింగులు సక్రమంగా నిర్వహించడంలో ఆదర్శ మండలి సమాఖ్య ఆదర్శంగా నిలిచింది. అవార్డు స్వీకరించడం పట్ల మండలి సమాఖ్య సభ్యులు ఇల్లంతకుంట మండల ప్రజలు ఆనందం వ్యక్తపర్చారు.

ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ గద్దె దిగాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కొవ్వొత్తుల ర్యాలీలో ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లటౌన్: దొంగ ఓట్లతో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ గద్దె దిగాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని పాత బస్టాండ్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా గాంధీ చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రజల ఓట్లను కొల్లగొడుతూ గెలుస్తున్న స్థితిగతులను కండ్లకు గట్టినట్లు వీడియో రూపంలో చూపించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్, టీపీసీసీ పిలుపు మేరకు ఓటు చోర్ గద్దె చోడ్ నినాదంతో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఏఎంసీ చైర్మన్ స్వరూపరెడ్డి, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత అబద్ధం



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: జిల్లాలో లేని యూరియా కొరతను కొంతమంది అదేపనిగా అసత్య ప్రచారం చేస్తున్నారని సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి సరిపడా యూరియా నిల్వలున్నాయని రైతులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాకు ఈనెలాఖరు వరకు 22వేల మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా.. ఇప్పటికే 13,500 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



వేములవాడ: రేవతి నక్షత్రోత్సవం సందర్భంగా గురువారం రాజన్న ఆలయంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయంలో పంచోపనిషత్ ద్వారాభిషేకం, పరివార దేవతార్చనలు, సదస్యం నిర్వహించారు.

తల్లి మందలించిందనే మనస్తాపంతో ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామంలో సంపంగి సంధ్య(25) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. సంధ్య – రమేశ్ భార్యాభర్తలు. వీరికి కూతురు వర్షిత ఉంది. రామగుండం స్వస్థలం. అయితే, వృత్తి రీత్యా లారీ డ్రైవర్ అయిన రమేశ్.. తన అత్తగారిల్లు కటికెనపల్లిలో ఉంటూ పనిచేసుకుంటున్నాడు. అయితే, సంధ్య కూతురు బుధవారం ఇంటివద్ద అల్లరి చేస్తోంది. అల్లరి ఎందుకు చేస్తున్నావని కొడుతోంది. గమనించిన సంధ్య తల్లి మామిడి సత్తమ్మ.. పాపను ఎందుకు కొడుతున్నావని మందలించింది. క్షణికావేశానికి లోనైన సంధ్య తీవ్రమనస్తాపం చెందింది. తన పత్తి చేనులోకి వెళ్లి గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కుటుంబ కలహాలతో మహిళ..

వీణవంక(హుజూరాబాద్): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొండపాక గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పానుగంటి ప్రమీల(56) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుందని పోలీసులు తెలిపారు. పానుగంటి విజయ్‌కుమార్,ప్రమీల దంపతులు. వీరికి ఇద్దరు కొడుకులు, రెండు, మూడు రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇంటిలోని బాత్‌రూంలో ఇనుపరాడుకు చీరతో ఉరేసుకుంది. భర్త విజయ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

- భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- నర్మాల ఎగువమానేరును పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గంభీరావుపేట(సిరిసిల్ల): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టును గురువారం ఎస్పీ మహేష్ బి గీతేతో కలిసి సందర్శించారు. ప్రాజెక్టులో నీటి నిల్వ, ఇన్‌ఫ్లో గురించి ఇరిగేషన్ అధికారుల నుంచి ఆరా తీశారు. పూర్తిస్థాయి నీటి మట్టం 2టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1.3టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు వివరించారు. ప్రస్తుతం ఎగువ నుంచి 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని తెలిపారు. ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే పది రోజుల్లో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుతుందని ఇరిగేషన్ అధికారులు అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డ్యాం గేట్లను పరిశీలించి వాటి నిర్వహణను పర్యవేక్షించారు. డ్యాం పూర్తిస్థాయిలో నిండితే ఎక్కువైతే నీటిని సాగునీటి కాలువల ద్వారా విడుదల చేయాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వీరి వెంట ఇరిగేషన్ జిల్లా అధికారి కిశోర్ కుమార్, ఈఈ ప్రశాంత్‌కుమార్, డీఈ నర్సింగ్, పోలీస్ అధికారులు ఉన్నారు.

ఆక్రమించిన భూములు స్వచ్ఛందంగా అప్పగించాలి

సిరిసిల్ల: జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా అప్పగించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో గురువారం ప్రభుత్వ భూమిని ఆక్రమించిన బీఆర్‌ఎస్ నాయకులు ఒజ్జల అగ్గి రాములు 4.02 ఎకరాల భూమిని కలెక్టర్, ఎస్పీ మహేశ్ బి గీతే సమక్షంలో ప్రభుత్వానికి సరేండర్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్దాపూర్‌కి చెందిన అగ్గి రాములు సర్వే నం.61/47లోని ప్రభుత్వ భూమి కబ్జా చేసుకుని సాగు చేస్తున్న 4 ఎకరాల 2 గుంటలను తిరిగి అప్పగించాడని తెలిపారు. ఇంకా ఎవరైన ఉంటే స్వచ్ఛందంగా అప్పగించాలని, లేకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

జిల్లాలోని బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నేషనల్ స్కాలర్ షిప్ స్కీమ్‌లో బీడీ కార్మికుల పిల్లలకు అందించే ఉపకార వేతనాలపై అధికారులతో సమీక్షించారు. కేంద్ర కార్మిక శాఖ ద్వారా బీడీ కార్మికులు, లైమ్ స్టోన్ డోలో మైట్ ఖనిజాల కార్మికులు, మైకా మైనింగ్ కార్మికులు, ఐరన్ ఓర్ , క్రోమ్ ఓర్ మైనింగ్ కార్మికులు, సినీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఆరు నెలల పాటు బీడీ కార్మికులుగా పని చేసి వార్షిక ఆదాయం రూ.1.20లక్షల లోపు ఉన్న వారంతా ఈ పథకానికి అర్హులని అన్నారు. ఆగస్టు 31లోగా పదో తరగతి లోపు చదివే పిల్లలు, అక్టోబరు 31వ తేదీలోగా ఇంటర్‌కు పైగా చదివే వారు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈ సమావేశంలో కేంద్ర ఉప సంక్షేమ కమిషనర్ సాగర్ ప్రధాన్, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు మహేందర్, మధూకర్, వెంకటేశ్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫొద్దీన్, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, వివిధ మండలాల ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయి గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. భారీ వర్షాలు, వరదలపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావులు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు.

సేవలకు దక్కిన గౌరవం

- ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఇద్దరు ఏఎస్సైలు



రాజేశుని శ్రీనివాస్



రుద్ర కృష్ణకుమార్

జగిత్యాలక్రైం/మల్యాల: విధి నిర్వహణలో వారు ఎప్పుడూ ముందున్నారు. తమ సర్వీసులో ఏనాడూ మచ్చ కూడా ఎరగరు. వారి సేవలను గుర్తించిన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనేక పతకాలు అందించింది. తాజాగా ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్‌కు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. జగిత్యాల స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్, మల్యాల పోలీస్‌స్టేషన్ ఏఎస్సై రుద్ర కృష్ణకుమార్‌కు మెడల్ ప్రకటించింది. రాజేశుని శ్రీనివాస్ 1989లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరారు. 2012లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2019లో ఏఎస్సైగా పదోన్నతి పొందారు. 2012లో రాష్ట్ర పోలీసు సేవా పథకం, 2019లో ఉత్తమ సేవా పథకం అందుకున్నారు. 36ఏళ్లుగా పోలీస్ పోలీసు శాఖకు చేస్తున్న సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేసింది. అలాగే రుద్ర కృష్ణ కుమార్ 1989లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరారు. 2017లో హెడ్‌కానిస్టేబుల్‌గా.. 2021లో ఏఎస్సైగా పదోన్నతి పొందారు. 2022లో రాష్ట్ర పోలీసు సేవా పథకానికి ఎంపికయ్యారు. 36 ఏళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేశారు. ఇద్దరిని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. కష్టపడి పనిచేసే పోలీస్ అధికారులకు గుర్తింపు వస్తుందని తెలిపారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

లీడింగ్ ఫైర్ ఆఫీసర్ వహిదుల్లాఖాన్‌కు రాష్ట్రపతి పతకం



వహిదుల్లాఖాన్

మెట్‌పల్లి: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఫైర్ స్టేషన్‌లో లీడింగ్ ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వహిదుల్లాఖాన్ అత్యున్నత పురస్కారమైన రాష్ట్రపతి పతకానికి ఎంపికయ్యారు. 1986లో ఫైర్‌మెన్‌గా అగ్నిమాపక శాఖలో చేరిన ఆయన.. ఆసిఫాబాద్, ఇచ్చోడ, ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్‌లో పని చేసి.. రెండేళ్ల క్రితం మెట్‌పల్లికి బదిలీపై వచ్చారు. 2015లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పదోన్నతి పొందారు. మొదటి నుంచి అంకితభావంతో పనిచేసే ఆయన విపత్తుల సమయాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారనే పేరు సంపాదించారు. అత ని సేవలకు గుర్తింపుగా ఇప్పటివరకు ఆరు ప్రశంసపత్రాలు, ఒక సేవాపతకం ప్రదానం చేశారు. ప్రస్తుతం రాష్ట్రపతి పతకానికి ఎంపిక కావడంపై ఆయనను ఉన్నతాధికారులు అభినందించారు.

లీడింగ్ ఫైర్‌మెన్ గోపాల్‌రెడ్డికి..



గోపాల్‌రెడ్డి

జమ్మికుంట: జమ్మికుంట పట్టణ అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బీరెడ్డి గోపాల్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఫైర్‌మెన్‌గా విధుల్లో అత్యంత ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. ఫైర్ ఆఫీసర్‌గా విధుల్లో క్రమ శిక్షణ, నిబద్ధతతో పని చేసినందుకు అవార్డుకు ఎంపికైనట్లు గోపాల్ రెడ్డి తెలిపారు.

ఏడాది అనంతరం మిడ్‌మానేరుకు ఎల్లంపల్లి నీరు



వరదకాలువ ద్వారా మిడ్‌మానేరుకు వస్తున్న జలాలు

బోయినపల్లి(చొప్పదండి): ఏడాది అనంతరం శ్రీపాద ఎల్లంపల్లి నీరు ఎత్తిపోతల ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి తరలుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీ ఇన్‌ఫ్లో వస్తున్న నేపథ్యంలో ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు గోదావరి జలాలు తరలిస్తున్నారు. గురువారం ప్రాజెక్టులో 8.084 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

గతేడాది జూలైలో 14టీఎంసీల ఎత్తిపోతలు

గతేడాది వర్షాకాలం ఆరంభంలో సరైన వర్షాలు కురువక మిడ్‌మానేరులో నీటి నిల్వలు అడుగంటాయి. 2024 జూలై 28నుంచి ఎల్లంపల్లి నుంచి ప్రాజెక్టు నుంచి వయా నందిమేడారం, లక్ష్మీపూర్‌ల నుంచి ఎత్తిపోతల ద్వారా వరద కాలువకు నీరు ఎత్తి పోశారు. సుమారు 14 టీఎంసీల మేర నీటిని వరదకాలువ మీదుగా మిడ్‌మానేరు ప్రాజెక్టుకు తరలించారు.

ఫలించిన రైతన్నల ఆశలు

ఆశించిన మేర వర్షాలు కరవకపోవడంతో ఎల్లంపల్లి నీరు విడుదల చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎల్లంపల్లి జలాలు వరదకాలువ మీదుగా మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి చేరుతుండడంతో ఈప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1,947కే ఆరోగ్య పరీక్షలు



మాట్లాడుతున్న గుర్రం కిరణ్

కరీంనగర్‌టౌన్: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం ప్రత్యేక హెల్త్ చెకప్ ప్యాకేజీ ప్రవేశ పెట్టిందని ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేమాతరం హెల్త్ చెకప్ ప్యాకేజీ పేరిట అందుబాటులోకి తీసుకొచ్చిన పూర్తిస్థాయి ఆరోగ్య పరీక్షలను రూ.1,947 చెల్లించి పొందవచ్చన్నారు. కార్డియాలజీ, జనరల్ ఫిజీషియన్, డైటీషియన్ కన్సల్టేషన్‌తోపాటు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ), కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్(సీయూఈ), ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, లిపిడ్ ప్రొఫైల్, లివర్ ఫంక్షన్ టెస్ట్(ఎల్‌ఎఫ్‌టీ), ఎక్స్‌రే చెస్ట్ (విత్‌అవుట్ ఫిలిం), ఈసీజీ, 2డీ ఎకో, హెపటైటిస్‌బీఏ1సి, సీరం యూరియా, అల్ట్రాసౌండ్ స్కానింగ్ (అబ్డొమెన్- పెల్విస్), సీరం క్రియాటినిన్ పరీక్షలు ఈ ప్యాకేజీ ద్వారా నిర్వహిస్తామని వివరించారు. ఈ ప్యాకేజీ సెప్టెంబర్ 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విషజ్వరంతో ఒకరి మృతి

సారంగాపూర్: మండల కేంద్రానికి చెందిన మోతుకు గంగమల్లు (55) విషజ్వరంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. గంగమల్లు రెండురోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. బంధువులు జిల్లాకేంద్రంలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న క్రమంలో గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన 40 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ.12.96లక్షల విలువ గల చెక్కులు అందజేశారు. వైద్య రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారిందని అన్నారు. పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పదేళ్లలో రూ. 400 కోట్లు పంపిణీ చేస్తే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు రూ.800 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురికి జైలు

వేములవాడ: భూతగాదా కేసులో హత్యాయత్నానికి పాల్పడిన ఆరుగురికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ వేములవాడ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్ గురువారం తీర్పు నిచ్చారు. టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మండలం చంద్రగిరికి చెందిన ఎల్లయ్య గ్రామ శివారులోని తన వ్యవసాయ సాగు భూమిలో భార్య వెంకటలక్ష్మి, కొడుకు శరత్ కుమార్‌తో కలిసి వ్యవసాయం చేసుకుంటున్నాడు. వీరి భూమి పక్కనే అదే గ్రామానికి చెందిన దేశవేణి లింగయ్య వ్యవసాయ భూమి ఉంది. లింగయ్య ఆ భూమిని ఎల్లయ్య సోదరుడి వద్ద 15 ఏళ్ల క్రితం కొన్నారు. అప్పటి నుంచి హద్దుల విషయంలో ఇరువురి మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. వీటిపై పలు దఫాలు పంచాయితీలు నిర్వహించినా పరిష్కారం లభించలేదు. ఈ తగాదాలు తొలగాలంటే ఎల్లయ్య కుటుంబాన్ని హత్య చేయాలని దేశవేని లింగయ్య, అతని భార్య కనకవ్వ, కొడుకు కనకరాజు, తమ్ముని కొడుకు శ్రీనివాస్, సరోజన, తిరుమలలు పథకం పన్నారు. దీనిలో భాగంగా 2020 డిసెంబర్ 25న ఎల్లయ్య కొడుకు ముత్త శరత్‌కుమార్ తన పొలంలో ఒంటరిగా పనిచేస్తున్నాడని తెలుసుకున్న ఆరుగురు పొలం వద్దకు చేరుకుని కర్రలు, రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ సంఘటనపై ఎల్లయ్య వేములవాడ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సీఐ వెంకటేశ్ దర్యాప్తు చేశారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి కోర్టులో ప్రవేశ పెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి నిందితులు అరుగురికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధించారు. ఈ కేసులో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన ప్రాసిక్యూషన్, దర్యాప్తు అధికారులు, సీఎంఎస్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

గుండుసూదిపై జాతీయ జెండాతో పరుగెడుతున్న యువతి

- సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ అద్భుత సృష్టి



గుండు సూది మొనపై జాతీయ జెండాతో యువతి



చిత్ర రూపకర్త గుర్రం దయాకర్

జగిత్యాలటౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ గుండుసూది మొనపై జాతీయ జెండాతో పరుగెడుతున్న యువతి చిత్రాన్ని రూపొందించి ఔరా అనిపించాడు. పండుగలు, పబ్బాలు, జాతీయ పండుగలు వంటి ప్రత్యేక సందర్భంలో ఏదో సూక్ష్మరూప చిత్రం ద్వారా సమాజానికి సందేశం పంపించే దయాకర్.. ఈ స్వాతంత్ర్య వేడుకకు జాతీయ జెండాతో పరుగులు పెడుతున్న యువతి సూక్ష్మకళాకండాన్ని రూపొందించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందు వరుసలో నిలుస్తున్నారన్న సందేశాన్ని సమాజానికి అందించడమే ఈ చిత్ర ఉద్దేశమని దయాకర్ తెలిపారు. ఈ సూక్ష్మ కళారూపాన్ని తయారు చేసేందుకు మైనం పెన్సిల్ కలర్స్ ఉపయోగించానని, పది గంటల సమయం పట్టినట్టు తెలిపారు.

నేడు సిరిసిల్లలో కృష్ణాష్టమి వేడుకలు



మాట్లాడుతున్న అచ్యుతదాస్

సిరిసిల్లటౌన్: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా జిల్లా కేంద్రం సిరిసిల్లలో శుక్రవారం కన్నులపండువగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ఇన్‌చార్జి ప్రాణనాథ అచ్యుత దాస్ అన్నారు. గురువారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళ్యాణలక్ష్మి గార్డెన్‌లో నిర్వహించే వేడుకల్లో గురుపూజ, హరే కృష్ణ మంత్ర జపాలు, రాధాకృష్ణులకు ఉయ్యాల సేవ, మహా నైవేద్యాలు, హారతి, కుంభహారతి, మహాభిషేకం , పుష్పాభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు, సంకీర్తనలు జరుగుతాయన్నారు. ఇస్కాన్ ప్రతినిధులు నరుత్తమదాస్, హరిహరదాసు, మధుసూధన్‌దాస్, రసానంద ప్రియదాస్ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మకళ.. భళా



చాక్‌పీస్‌పై చెక్కిన జాతీయజెండా



పెన్సిల్ మొనపై చెక్కిన జాతీయజెండా

ఓదెల(పెద్దపల్లి): మడక గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెన్సిల్ మొనపై 4 మి.మీ. పొడవు, 2 మి.మీ. వెడల్పుతో అతిచిన్న జాతీయ జెండా రూపొందించారు. ఇందుకోసం సుమారు గంట సమయం తీసుకున్నారు. చాక్‌పీస్‌పై 7 మి.మీ. పొడవు, 5 మి.మీ. వెడల్పుతో గంట పది నిమిషాలపాటు శ్రమించి చెక్కారు. చాక్‌పీస్‌పై హ్యాపీ ఇండిపెండెన్స్‌డే ఆంగ్ల అక్షరాలు చెక్కి శుభాకాంక్షలు చెక్కారు. వీటిని వివిధ బుక్ ఆఫ్ రికార్డులకు ప్రతిపాదించినట్లు రజనీకాంత్ తెలిపారు.